**శ్రీ రాముని దయచేతను**
**నారూఢిగ సకలజనులు నౌరాఁయనగా**
**ధారాళైన నీతులు**
**నోరూరఁగఁ జవులు పుట్ట నుడివెద సుమతీ!**

**<u>భావము:</u>** మంచి బుద్ధి గలవాడా! శ్రీరాముని యొక్క దయవలన నిశ్చయముగా అందరు జనులును సెభాసనునట్లుగా నోటినుండి నీళ్లూరునట్లుగా రసములు పుట్టగా న్యాయమును బోధించు నీతులను చెప్పెదను.

**అక్కఱకు రాని చుట్టము**
**మ్రొక్కిన వరమీని వేల్పు యోహరమునఁదా**
**నెక్కినఁబారని గుఱ్ఱము**
**గ్రక్కున విడువంగవలయుఁగదరా సుమతీ!**

**<u>భావము:</u>** అవసరమునకు పనికిరాని చుట్టమును, నమస్కరించి వేడిననూ కోరిక నెఱవేర్చని భగవంతుని, యుద్ధ సమయమున ఎక్కినప్పుడు ముందుకు పరుగెత్తని గుఱ్ఱమును వెంటనే విడిచి పెట్ట వలయును.

**అప్పిచ్చువాఁడు వైద్యుఁడు**
**నెపప్పుడు నెడతెగక బాఱు నేఱును, ద్విజుఁడున్**
**జొప్పడిన యూర నుండుము**
**బొప్పడకున్నట్టి యూరు జొరకుము సుమతీ!**

**<u>భావము:</u>** ఓ సుమతీ! ఋణము నిచ్చువాడును, వైద్యుడును, ఎల్లప్పుడును ఆగకుండ ప్రవహించు నదియును, బ్రాహ్మణుఁడునుగల గ్రామమందు నివసింపుము, వారు లేనట్టి గ్రామమందు నివసింపకుము.

**ఇమ్ముగఁ జదువని నోరును**
**అమ్మాయని పిలిచి యన్న మడుగని నోరున్**
**దమ్ములఁ బిలువని నోరును**
**గుమ్మరి మను ద్రవ్వినట్టి గుంటర సుమతీ!**

**భావము:** ఇంపుగా పఠింపని నోరును, అమ్మా! అని పిలిచి అన్నము అడుగని నోరును, తమ్ముడా! అనితమ్ములను పిలువనినోరును, కుమ్మరి వాఁడు త్రవ్విన మన్ను గోయితో సమానం.

**ఇచ్చునదె విద్య, రణమునఁ**
**జొచ్చునదె మగతనంబు, సుకవీశ్వరులున్,**
**మెచ్చునదె నేర్పు, వాదుకు**
**వచ్చునదే కీడుసుమ్ము వసుధను సుమతీ!**

**భావము:** లోకంలో విద్యతో కూడిన ధనమును సంపాదించాలి. యుద్ధభూమి యందు పౌరుషముతో విజయము పొందాలి. కవిశ్రేష్ఠులు మెచ్చుకొనే నేర్పుగల కవిత్వమును వ్రాయాలి. తగవునకు వచ్చు వాక్యములే హానిని కలిగిస్తాయని సుమా!

**ఉపకారికి నుపకారము**
**విపరీతము గాదు సేయ వివరింపంగా**
**నపకారికి నుపకారము**
**నెపమెన్నకఁ జేయువాడె నేర్పరి సుమతీ!**

**భావము:** ఓ సుమతీ! మనకు ఉపకారము చేసిన వారికి తిరిగి ఉపకారము చేయుట మంచి లక్షణము. అంతేగాని అందులో ప్రత్యేకత లేదు. కానీ అపకారము చేసిన వారిపై నెపములెన్నక తిరిగి వారికే ఉపకారము చేయుగలిగినవాడే "నేర్పరి" అనిపించుకొనును.

**ఉత్తమ గుణములు నీచున**
**కెత్తెఱంగున గలుగనేర్చు వెయ్యడం దా**
**నెత్తెచ్చి కఱగిపోసిన**
**నిత్తడి బంగారుమగునె యిలలో సుమతీ!**

**భావము:** బంగారమునకు సమానమైన ఇత్తడిని తీసుకుని ఎన్నిసార్లు కరిగించిననూ అది బంగారము కాజాలదు. అట్లే నీచునకు ఉత్తమ గుణములబ్బవని భావము.

**ఎప్పుడు సంపద కలిగిన**
**నప్పుడు బంధువులు వత్తు రది యెట్లన్నన్**
**దెప్పలుగఁ జెఱువు నిండినఁ**
**గప్పలు పదివేలుఁ జేరుఁగదరా సుమతీ!**

**భావము:** ఓ సుమతీ! మనకు ఎప్పుడైతే ఎక్కువగా పంపదలు చేకూరునో, అప్పుడు బంధువులు అధికంగా వచ్చెదరు. అదెట్లనగా చెఱువు నిండా నీరు జేరి అలలు వచ్చునట్టి సమయమున వేలకొలది కప్పలు వచ్చి చేరును కదా! అంటే చెరువులో నీరు నిండినప్పుడే ఎలా అయితే కప్పలు కుప్పలు తెప్పలుగా వచ్చి చేరునో అలాగే సంపద ఉన్నప్పుడే బంధువులు వచ్చి చేరుదురు అని భావము.

**ఎప్పటికెయ్యది ప్రస్తుత**
**మప్పటి కా మాటలాడి యన్యుల మనముల్**
**నొప్పింపక తా నొవ్వక**
**తప్పించుక తిరుగువాఁడు ధన్యుఁడు సుమతీ!**

**భావము:** ఏ సమయమునకు ఏది తగినదో, అప్పటికి ఆ మాటలను పలికి, ఇతరుల మనస్సులను బాధింపక, తను బాధపడక తప్పించుకొని నడచుకొనువాడే కృతార్థుడు.

**ఏఱకుమీ కసుగాయలు**
**దోఱకుమీ బంధుజనుల దోషము సుమ్మీ**
**పాఱకుమీ రణమందున**
**మీఱకుమీ గురువులాజ్ఞ మేదిని సుమతీ!**

**భావము:** ఈ భూమిమీద వచ్చి కాయలు ఏఱి తినకము. చుట్టమును దూషింపకము. యుద్ధమునుంచి పారిపోకము, పెద్దల ఆజ్ఞను జవ దాటకము.

**ఓడల బండ్లును వచ్చును**
**ఓడలు నా బండ్లమీఁద నొప్పుగ వచ్చున్**
**ఓడలు బండ్లును వలెనే**
**వాడంబడుఁగలిమిలేమి వసుధను సుమతీ!**

**భావము:** ఓడల మీద బండ్లును, బండ్ల మీద "నావ"లు వచ్చునట్లుగనే భాగ్యవంతులకు దారిద్ర్యమును, దారిద్ర్యంతులకు భాగ్యమును బండి చక్రపుటాకుల వలె వచ్చును. అంటే కలిమిలేములు స్థిరము గాదని భావము.

**కనకపు సింహాసనమున**
**శునకము కూర్చుండఁబెట్టి శుభలగ్నమునఁ**
**దొనరగ బట్టము కట్టిన**
**వెనకటి గుణమేల మాను వినరా సుమతీ!**

**భావము:** ఓ మంచి బుద్ధి గలవాడా! మంచి ముహూర్తము చూసి కుక్కను తీసుకుని వెళ్లిబంగారపు సింహాసనమున కూర్చోబెట్టి పట్టాభిషేకము చేసినా కూడా అది దాని నైజాన్ని ఎలా అయితే మార్చుకోలేదో అలాగే అల్పుడైన వానిని ఎంతో గౌరవించి ఉన్నత పదవిలో కూర్చుండబెట్టినా అతని బుద్ధి మారదు. అంటే ఎంత ఉన్నత పదవి వరించినా కూడా అల్పుడు తన నీచత్వమును వదలనేరడు అని భావము. కుక్క బంగారు సింహాసనము మీద కూర్చున్నా కూడా దాని వెనుకటి నైజమును ఎలా మార్చుకోలేదో అలా అల్పుడు కూడా తన బుద్ధిని మార్చుకోలేడు అని భావము.

**కూరిమి గల దినములలో**
**నేరము లెన్నడు గలుగనేరవు మరి యా**
**కూరిమి విరసంబైనను**
**నేరములే తోచుచుండు నిక్కము సుమతీ!**

**భావము:** ఓ సుమతీ! స్నేహము బాగుగా ఉన్న రోజులలో ఆ స్నేహితులకు ఒకరు చేసిన పనులలో మరొకరికి తప్పులు కనిపించవు. అదే స్నేహితులకు విరోధము వచ్చినపుడు అన్నీ నేరములుగాను, తప్పులుగాను కనిపిస్తాయి. ఇది నిజము... ఇది సహజము.

**కమలములు నీటcబాసినc**
**గమలాప్తుని రశ్మి సోcకి కమలిన భంగిన్**
**దమ దమ నెలవులు దప్పినc**
**దమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ!**

**భావము:** కమలముకు నివాసము నీరు. ఆ కమలములు తమ నివాసమైన నీటిని విడిచిపెట్టిన తరువాత మిత్రుడగు సూర్యుని వేడిచే కమలిపోవును. అట్లే మానవులు కూడా తమ తమ నివాసములను విడిచిపెట్టినచో, తమ స్నేహితులే విరోధులుగా మారి భాధించును. ఇది నిజమని గమనించాలి.

**కులకాంత తోడ నెప్పుడుc**
**గలహింపకు, వట్టి తప్పు ఘటియింపకుమీ**
**కలకంఠి కంట కన్నీరొలికిన**
**సిరి యింటనుండ నొల్లదు సుమతీ!**

**భావము:** భార్యతోడు ఎప్పుడూ జగడమాడ వలదు. లేని నేరములు ఆరోపించవలదు. ఉత్తమ ఇల్లాలి యొక్క కంట నీరు క్రిందపడిన ఆ ఇంటియందు లక్ష్మిదేవి నిలువదు.

**కొఱగాని కొడుకు పుట్టినఁ**
**కొఱగామియె కాదు తండ్రి గుణముల జెఱచున్**
**జెఱకు తుద వెన్నుఁబుట్టిన**
**జెఱకునఁ దీపెల్ల జెఱచు సిద్ధము సుమతీ!**

**భావము:** చెఱకుగెడ చివర వెన్నుపుట్టినచో యా చెఱకుగెడ యందలి తీపి అంతయును ఎట్లు చెరచునో అట్లే అప్రయోజకుడగు కుమారుడు పుట్టిన ఆ వంశమునకు ఉపకారి కాకపోయిననూ సరే గదా! తన తండ్రి మంచి గుణములను చెరచును. చెడ్డకీర్తి తెచ్చునన్న మాట.

**చీమలు పెట్టిన పుట్టలు**
**పాము కిరవైన యట్లు పామరుఁడు దగన్**
**హేమంబుఁ గూడఁబెట్టిన**
**భూమీశుల పాలజేరు భువిలో సుమతీ!**

**భావము:** ఓ సుమతీ! భూమిలో చీమలు కష్టపడి పెట్టిన పుట్టలో పాములు చేరును. అట్లే మూర్ఖుడు దాచి ఉంచిన బంగారం రాజులపాలై అతనికి ఉపయోగపడక పోవును.

**తలనుండు విషము ఫణికి**
**వెలయంగా దోకనుండు వృశ్చికమునకున్**
**దల తోఁక యనక యుండును**
**ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!**

**భావము:** ఓ సుమతీ! సర్పమునకు అంటే పాముకు తల యందు మాత్రమే విషము ఉండును. తేలుకు తోకయందు విషము ఉండును. కానీ మనిషికి మాత్రము తల, తోక అని లేకుండా నిలువెల్ల అంటే శరీరమంతా విషము ఉండునని భావము.

**తన కోపమె తనకు శత్రువు**
**తన శాంతమె తనకు రక్ష దయ చుట్టం**
**తన సంతోషమె స్వర్గము**
**తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!**

**భావము:** ఓ సుమతీ! ఎవరికైననూ తన కోపమే తనకు శత్రువ అగును. తన శాంతమే తనకు రక్షగా నిలచును. తన చూపెడి దయా గుణమే బంధువులవలె సహకరించును. తాను సంతోషముగా ఉండ గలిగినచో అది స్వర్గముతో సమానము. తాను దుఃఖమును చేతులార తెచ్చుకొనినచో అదియే నరకమగుట తథ్యము!!

**నీరే ప్రాణాధారము,**
**నోరే రసభరితమైన నుడువుల కెల్లన్**
**నారియె వరులకు రత్నము**
**చీరయే శృంగారమండ్రు, సిద్ధము సుమతీ!**

**భావము:** అన్ని ప్రాణులకు నీరే ఆధారమైనది. నవరస భరితములైన మాటలకు ఆధారము నోరు. వస్త్రమే మానవునకు అందము తెచ్చునది. నీరు – నోరు – మహిళ – వస్త్రము ప్రజలకు ముఖ్యమని భావము.

**పుత్రోత్సాహము తండ్రికి**
**పుత్రుడు జన్మించినప్పుడె పుట్టదు జనులా**
**పుత్రుని కనుగొని పొగడగ**
**పుత్రోత్సాహంబునాడు పొందుర సుమతీ!**

**భావము:** ఓ సుమతీ! కొడుకు పుట్టగానే తండ్రికి సంతోషము కలుగదు. కానీ ఆ కొడుకు గొప్పవాడై ప్రజలు అతనిని పొగడుతున్నప్పుడు ఆ తండ్రికి నిజమైన సంతోషము కలుగును.

**బలవంతుఁడు నాకేమని**
**పలువురితో నిగ్రహించి పలుకుట మేలా**
**బలవంతమైన సర్పము**
**చలిచీమల చేతఁజిక్కి చావదె సుమతీ!**

**భావము:** నేను బలవంతుడను, విద్యావంతుడను అని గర్వంతో సంచరించరాదు. ఆవిధంగా నిర్లక్ష్యంగా ఉండి అందరితో విరోధము తెచ్చుకోవడం మంచిది కాదు. అది ఎప్పుడైనా హాని కలిగించును. మిక్కిలి బలము కలిగిన సర్పము కూడా చలి చీమలకు చిక్కి చచ్చుచుండుట లేదా? పాములను చంపుట చలి చీమలకు అసాధ్యము గదా! సాటి వారితో సమయానుకూల స్నేహము చేయాలని బోధ.

**బంగారు కుదువ చెట్టకు**
**సంగరమునఁ బాఱిపోకు సరసుఁడవగుచో**
**సంగడి వెచ్చము లాడకు**
**వెంగలితోఁజెలిమి వలదు వినరా సుమతీ!**

**భావము:** బంగారు వస్తువులను తాకట్టు పెట్టరాదు. యుద్ధము నందు వెన్ను చూపించి పారిపోవరాదు. అంగడియందు వస్తువులు అరువు తెచ్చుకోరాదు. మూఢునితో స్నేహము చేయరాదే. అందుచే కష్టములు వచ్చునని భావము.

**మాటకుఁ బ్రాణము సత్యము**
**కోటకుఁ బ్రాణంబు సుభట కోటి, ధరిత్రిన్**
**బోటికిఁ బ్రాణంబు మానము**
**చీటికిఁ బ్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ!**

**భావము:** నోటిమాటకు సత్యము ప్రాణము. పెద్ద దుర్గమునకు గొప్పదైన సేనా సమూహము ప్రాణము. స్త్రీలకు అభిమానము ప్రాణము. పత్రమునకు చేవ్రాలు ప్రాణములని గుర్తించి జీవనము చేయాలని ప్రబోధము.

**వినఁదగు నెవ్వరు చెప్పిన**
**వినినంతనె వేగపడక వివరింపదగున్**
**కనికల్ల నిజము దెలిసిన**
**మనుజుఁడెపో నీతిపరుడు మహిలో సుమతీ!**

**భావము:** ఎవరు ఏమి చెప్పినా వినవచ్చును. అందులో ఎలాంటి తప్పులేదు. అయితే విన్న వెంటనే తొందరపడి నిర్ణయము తీసుకోకూడదు. బాగా ఆలోచించి, పరిశీలన చేసి ఆతర్వాత నిర్ణయము తీసుకోవాలి. అలా ఎవరైతే బాగా పరిశీలన చేసిన మీదట నిర్ణయము తీసుకుంటారో వారే ధర్మాత్ముడు అని భావము.

**వరిపంట లేని యూరును**
**దొరయుండని యూరు తోడు దొరకనితెరువున్**
**ధరను బతిలేని గృహమును**
**అరయంగా రుద్రభూమి యనఁదగు సుమతీ!**

**భావము:** వరి పంట లేని ఊరును, ప్రభువు లేని ఊరును. సహాయము దొరకని మార్గమును, భర్త లేని ఇల్లును, ఆలోచింపగా శ్మశానము వలె ఉండును. గాన పంటలు, ప్రభువు, మార్గము, భర్త ఉండాలని నీతి.

**సిరి తా వచ్చిన వచ్చును**
**సలలితముగ నారికేళ సలిలము భంగిన్**
**సిరి దాఁబోయిన బోవును**
**కరిమ్రింగిన వెలగపండు కరణిని సుమతీ!**

**భావము:** సుమతీ! టెంకాయ లోపలికి నీరు వచ్చినట్లు సంపద తెలియకుండానే వస్తుంది. ఏనుగు మ్రింగిన వెలగపడులోని గుజ్జు మాయమగు విధంగానే మాయమగును.

**స్త్రీలయెడ వాదులాడక**
**బాలురతోఁ జెలిమి చేసి భాషంపకుమీ**
**మేలైన గుణము విడువకు**
**ఏలిన పతి నిందసేయ కెన్నడు సుమతీ!**

**భావము:** ఎన్నడునూ స్త్రీలతో వివాదములాడకూడకుము, బాలురతో స్నేహము చేసి మాట్లాడకుము, మంచి గుణములు వదలకుము, పాలించు యజమానుని దూషింపకుము.